

ఐశ్వర్య ఇంట్లో వెండి, బంగారు సామగ్రి స్వాధీనం

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత డీకే సురేష్ చెల్లెలుగా చెప్పుకుంటూ పలువురిని మోసం చేసిన ఐశ్వర్య గౌడ ఇంట్లో భారీగా వెండి, బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీసులు జరిపిన సోదాల్లో 29 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలతో పాటు విలాసవంతమైన కార్లను గుర్తించారు. రాజ రాజేశ్వరీనగర్ పోలీసులు సోదాలు నిర్వహించారు. బెయిల్ దక్కినా ఐశ్వర్య గౌడపై మరిన్ని కేసులు తప్పేలా లేవని పోలీసులు అంటున్నారు.



బస్సు చార్జీల పెంపు..

మంత్రివర్గం ఆమోదం

● నామినేటెడ్ ఎమ్మెల్సీ ఎంపిక నిర్ణయం సీఎండే..

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శక్తి గ్యారెంటీ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం ఇతరుల ప్రయాణాలపై భారం మోపింది. రాష్ట్రంలోని నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్‌లు ప్రస్తావించిన చార్జీల పెంపుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. 23 అంశాలపై చర్చలు జరిపిన కేబినెట్ అన్నింటినీ ఆమోదం తెలిపినట్లు శాసనసభా వ్యవహారాలు, న్యాయశాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వివరించారు. నాలుగు రవాణా కార్పొరేషన్‌లు బస్సు చార్జీలు పెంచాలని ప్రతిపాదించారని అందుకు అనుగుణంగా 15శాతంకు ఆమోదం తెలిపామన్నారు. ఆర్టీసీ సంస్థలు చేసే అప్పులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేలా తీర్మానించామన్నారు. ఇకపై ఆర్టీసీ సంస్థలు చేసే రుణాలకు ప్రభుత్వం ష్యూరిటీ ఇవ్వనుందన్నారు. హుబ్బళ్ళి-ధారవాడ జంట నగరాలకు కలిపి ఒక్కటిగానే ఉండే మహానగర పాలికెను రెండుగా విభజిస్తూ తీర్మానించారు. ఒకటవ వార్డు నుంచి 26వ వార్డు దాకా ధారవాడ మహానగర పాలికెగాను 27 నుంచి 82వ వార్డు దాకా హుబ్బళ్ళి మహానగర పాలికెగాను విభజించారు. ఇకపై రెండు వేర్వేరు కార్యాలయాలతో పాటు ఇతరత్రా సౌలభ్యాలను విభజించే ప్రక్రియ త్వరలోనే జరుపనున్నట్లు తెలిపారు. విధానపరిషత్ సభ్యుడు కెహెచ్ తిప్పేస్వామి పదవీకాలం ముగిసిన మేరకు నామినేటెడ్ విధానంతో ఒకరిని ఎంపిక చేసే నిర్ణయాన్ని సీఎం సిద్దరామయ్యకే అప్పగిస్తూ మంత్రులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే ఎవరిని ఎంపిక చేయాలనేది త్వరలోనే సీఎం నిర్ణయం తీసుకోనున్నారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం భూముల సేకరణతో పాటు ఇతరత్రా సౌలభ్యాల సమకూర్చేందుకు ప్రస్తుతం ఉండే రూ.500 కోట్ల రుణ పరిమితిని ఏకంగా పదింతలు పెంచామని ఇకపై ఐదువేల కోట్ల దాకా వెసలుబాటుకు ఆమోదించామన్నారు. రాష్ట్రంలో గోశాలలు అభివృద్ధితో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న గోశాలలు మరిన్ని సౌలభ్యాలు కల్పించేందుకు రూ.10.50 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

నేడు 'శక్తి' గ్యారెంటీని పరిశీలించనున్న ఏపీ మంత్రులు

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయాలని భావిస్తున్న తరుణంలో కర్ణాటక శక్తి గ్యారెంటీ పథకాన్ని ఏపీ మంత్రులు పరిశీలించనున్నారు. గురువారం రాత్రి మంత్రులతోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు బెంగళూరుకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు శాంతినగర్‌లోని కేఎస్‌ఆర్టీసీ డిపోను సందర్శించనున్నారు. శాంతినగర్‌లోని కేఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో 11.30 గంటలకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను వీక్షిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా శక్తిగ్యారెంటీ అమలు చేస్తున్న విధానం, రోజువారీ ఎంత మంది ప్రయాణీకులకుసద్వినియోగం అవుతోంది, ఆర్టీసీకి ఎంత భారం, ఎంతమేర ఖర్చుకానుందనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తారు. మధ్యాహ్నం 1 గంటవరకు అక్కడే గడపుతారు. సాయంత్రం 5 గంటలకు విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలుస్తారు. శక్తిగ్యారెంటీ అమలుపై చర్చలు జరుపుతారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన మంత్రులు రవాణాశాఖ మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి, హోం మంత్రి అనితా, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణితో పాటు ఆర్టీసీ అధికారులు పాల్గొననున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డిని కలవనున్నారు. తద్వారా విధి విధానాలను ఖరారు చేయనున్నారు.

రికార్డు అమ్మకాలు..!

● ఒక్కరోజే రూ.9 కోట్ల మద్యం తాగేశారు
● బళ్లారి, విజయనగర జిల్లాల్లో కిక్కే..కిక్కు
● జోరుగా కొత్త సంవత్సరం వేడుకలు




బళ్లారి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరానికి ఉభయ జిల్లాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పోటాపోటీగా వేడుకలు చేసుకున్నారు. విజయనగరం, బళ్లారి జిల్లాల్లో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదు కావడం గమనార్హం. 2024 డిసెంబరు 31 ఒక్కరోజే బళ్లారి, విజయనగర జిల్లాల్లో రూ. 9 కోట్ల మద్యం అమ్ముడు పోయింది. విస్కీ, బ్రాందీ, లతో పాటు బీర్ల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. విజయనగర జిల్లాలో వివిద బ్రాండుల విస్కీ, బ్రాందీల బాక్సులు 10,706 బాక్కులు అమ్ముడు పోయాయి. 5,169 బీరు బాక్సులు అమ్మారు. విజయనగర జిల్లాలో మొత్తం 154 వివిద లైసెన్సు బార్లు, వైన్‌షాపులు ఉన్నాయి. అలాగే బళ్లారి జిల్లాలో ఒక్క డిసెంబరు 31 రోజునే 10,481 వివిద లిక్కర్ బాక్సులు, అలాగే 1,27,898 బీరు కేసులు అమ్ముడు పోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు అమ్మకాలు జోరుగా సాగినట్లు ఐఎంఎల్ అధికారులు ప్రకటించారు. చాలా దుకాణాల్లో సేల్ ఆర్డర్ కన్నా ఎక్కువగా అమ్ముడు పోవడంతో ఇతర షాపుల్లోనుండి ఇండెంట్ పెట్టి మద్యం తెచ్చుకుని అమ్ముకున్నారు. అర్ధరాత్రి వరకు దుకాణాలు, బార్లు కిటకిటలాయి.



ముహూర్తమే.. తరువాయి..!

● మంత్రివర్గ విస్తరణకు అంతా సిద్ధం ● ఆశావహుల్లో ఉత్తేజం
● అధిష్టానంతో చర్చించి తుది నిర్ణయం: సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది ఆరంభంలోనే కేబినెట్‌లోకి సరికొత్త మంత్రులు చేరే అవకాశాలు ఉన్నాయి. గడిచిన మూడు నెలలుగా తరచూ తెరపైకి వస్తున్న మంత్రివర్గ విస్తరణకు ముహూర్తమే తరువాయి అని తెలుస్తోంది. తమ శాఖలపై ఏడాదిన్నర గడిచినా ఏమాత్రం పట్టు సాధించని మంత్రులకు ఉద్వాసన తప్పదనే సంకేతాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆగస్టు తర్వాత ఒకటి రెండు సందర్భాలలో విస్తరణ అంశంపై చర్చలు సాగాయి. సీఎం, డీసీఎం ఢిల్లీకి వెళ్లినప్పుడు ఆశావహులు హస్తినకు వెళ్లారు. ఇటీవలికాలంలో పలువురు మంత్రులు అవినీతి, నేరాలను ప్రోత్సాహించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారిలో కొందరిని తప్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సీఎం సిద్దరామయ్యపై'ముడా' ఇంటిస్థలాల వివాదం తెరపైకి వచ్చినప్పుడు ఏకంగా నాయకత్వ మార్పు ఉంటుందనే చర్చ జరిగింది. సీనియర్ మంత్రులు సతీశ్ జార్కిహొళి, పరమేశ్వర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లడం, కొందరు మంత్రులు రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించిన అధిష్టానం తరపున పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, సుర్జేవాలాలు హుటాహుటిన బెంగళూరుకు వచ్చి సీఎల్పీ భేటీ జరిపి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో వ్యవహరిస్తే జనవరిలో మంత్రివర్గ మార్పు ఉంటుందని కేసీ వేణుగోపాల్ మంత్రులను మందలించారు. ఆ తర్వాత ఉప ఎన్నికలు, శాసనసభ శీతాకాల సమావేశాలు, కాంగ్రెస్ శతాబ్ధి ఉత్సవాలతో బిజీ బిజీ అయ్యారు. అన్నీ ప్రక్రియలు ముగియడంతో మరోసారి కొత్త సంవత్సరం ప్రారంభంలో ప్రధానమైన పండుగ సంక్రాంతి తర్వాత విస్తరణ ఉంటుందనే చర్చ సాగుతోంది.

మళ్లీ కేబినెట్‌లోకి నాగేంద్ర..!

శాసనసభ ఉప ఎన్నికలవేళ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి వ్యవహారంలో రాజీనామా చేసిన నాగేంద్రను మరోసారి మంత్రిని చేస్తామని స్వయంగా సీఎం ప్రకటించారు. కేబినెట్‌లో చోటు లభించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి వ్యతిరేకంగా మారి ఏకంగా పార్టీ క్రమశిక్షణ కమిటీ నుంచి ఏకంగా నోటీసులు అందుకుని ఆ తర్వాత అధిష్టానం పెద్దల సూచనతో వెనక్కి తగ్గారు. ఏడాది తర్వాత సీఎం సిద్దరామయ్యను కలిశారు. ఆయనకు కేబినెట్‌లో చోటు తప్పనిసరి కానుందనే ప్రచారం సాగుతోంది. మరోవైపు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్ నాలుగు రోజులక్రిందట మంత్రిగా ఎంతకాలం ఉంటానో తెలియదని అధిష్టానం కూడా సూచించిందనే రీతిలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న టీబీ జయచంద్ర కేబినెట్‌లోకి వస్తారనే ప్రచారం సాగుతోంది. అందుకు బలం చేకూరేలా శిర తాలూకాలో సోలార్‌ప్లాంట్ పరిశీలనకు వెళ్లిన మంత్రి కేజే జార్జ్ ఆయన సీనియర్ నేత అని, గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని మరోసారి కేబినెట్‌లోకి రావచ్చునన్నారు. ఇదే విషయమై టీబీ జయచంద్ర కూడా నాకు ఆశ ఉందని అయితే అధిష్టానం తీర్మానించాలన్నారు.

స్పందించిన సీఎం..

మంత్రి విస్తరణ తప్పనిసరిగా ఉంటుందనే అభిప్రాయాలు జోరందుకుంటున్న తరుణంలోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించారు. బెంగళూరులో మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా అధిష్టానంతో చర్చించాల్సి ఉందన్నారు. ప్రాథమికంగా ఢిల్లీలో చర్చల తర్వాతనే తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిని బట్టి విస్తరణకు సంబంధించి ఇప్పటికే పార్టీ అంతర్గతంగా చర్చలు ఉన్నట్లు అయ్యింది. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణ అంశం మూడునెలలుగా చర్చల్లో ఉంది. ఉప ఎన్నికలు, శాసనసభ సమావేశాల వంటి అన్ని అంశాలు కొలిక్కి రావడంతో అమలు చేయదలచారు. ఇప్పటికే పార్టీ అధిష్టానం మంత్రుల పనితీరుపై రహస్యంగా నివేదిక సేకరించినట్లు తెలుస్తోంది. 15నెలల పాలనలో వారి పనితీరుతోపాటు శాఖలపై పట్టు ఏ విధంగా సాధించారనే కోణంలో వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రస్తుత మంత్రులలో సుమారు 15-20 మంది దాకా క్రియాశీలకంగా లేరనే చెడ్డపేరు ఉంది. ఏడాదిన్నరలో తమ శాఖలపై కొందరు కనీస స్థాయిలో కూడా పరిశీలన జరుపలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. శాఖాపరంగా మీడియాకు సమాచారం ఇచ్చిన వారు మరింత తక్కువమందే ఉన్నారనే సమాచారం కూడా అధిష్టానంకు చేరినట్లు తెలుస్తోంది. వీటిన్నంటినీ పరిశీలిస్తే విస్తరణ కేవలం ముగ్గురు, నలుగురికి పరిమితం చేస్తారా..? లేదా 10మందికిపైగా మార్పులు చేసి ప్రక్షాళన చేస్తారా..? అనేది వేచి చూడాల్సిందే. అయితే ఆశావహుల్లో మాత్రం విస్తరణపై కలలు కంటున్నారు. కొందరైతే అధిష్టానం పెద్దలతో కలవడానికి ఇప్పటికే ఢిల్లీ బాట పట్టారు.

నేడు రాష్ట్రపతి రాక

● కేన్సర్ ఆసుపత్రిని ప్రారంభించనున్న ద్రౌపది ముర్ము



బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బెళగావిలో కేఎల్‌ఈ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక కేన్సర్ ఆసుపత్రిని ప్రారంభించేందుకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము బెళగావికి రానున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి బెళగావి సాంబ్ర విమానాశ్రయానికి శుక్రవారం ఉదయం రానున్నారు. కెఎల్‌ఈ విద్యాసంస్థల కార్యాధ్యక్షులు ప్రభాకర్ కోరే నేతృత్వంలో నిర్మించిన కేన్సర్ ఆసుపత్రిని సాయంత్రం 4గంటలకు జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం జిల్లా క్రీడా మైదానంలో జరిగే సభలో పాల్గొంటారు. సుమారు 300ల కోట్లతో 300ల పడకల సామర్థ్యం కలిగిన కేన్సర్ ఆసుపత్రిని నిర్మించారు. తక్కువ ధరలతోనే వ్యాధికి చికిత్సలు అందించే లక్ష్యంతో నిర్మించారు. ప్రభాకర కోరే గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఉత్తరకర్ణాటక జిల్లాల ప్రజలు కేన్సర్ బారిన పడితే ముంబై లేదా బెంగళూరుకు వెళ్లాల్సి ఉండేదన్నారు. స్థానికులు చికిత్సలు అందుబాటులో కల్పించాలనే లక్ష్యంతోనే అత్యాధునిక సౌలభ్యాలతో ఆసుపత్రిని నిర్మించామన్నారు. ఇక్కడి పూర్వ విద్యార్థులు అమెరికాలో నివసిస్తున్న డాక్టర్‌లు సంపత్‌కుమార్ శివవానగి ఉదయా శివానగిలు ఎనిమిది కోట్లు విరాళమిచ్చారన్నారు. రొబోటిక్ చికిత్సా విధానం కూడా ఉందన్నారు.

ఫిబ్రవరి 28 నుంచి

హంపి ఉత్సవాలు

● మంత్రి జమీర్ అహ్మద్

బళ్లారి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన హంపి ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్దరామయ్య సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈఏడాది ఉత్సవాలు ఉంటాయా..? ఉండవా ? అనే కళాకారుల ప్రశ్నలకు మంత్రి జమీర్ ఉంటాయి అనే సమాధానం ఇచ్చారు. హంపి ఉత్సవాలకు సంబందించి మంత్రి జమీర్ అహ్మద్ గురువారం అధికారికంగా ప్రకటించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హంపి ఉత్సవాల నిర్వహణకు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన బెంగళూరులో ప్రకటించారు. సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

పశు ఆరోగ్యంపై ప్రత్యేక ల్యాబొరేటరీ ప్రారంభం

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఇండియన్ నేషనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) బెంగళూరు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెటర్నరీ ఎపిడెమాలజీ అండ్ డిసీజ్ ఇన్‌ఫర్మేటిక్స్ (నివేది) సంయుక్త ఆధ్వర్యంలో పశుఆరోగ్యంపై ప్రత్యేక లేబొరేటరీని గురువారం ప్రారంభించారు. ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ కార్యాలయాన్ని సందర్శించారు. వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ అనిమల్ హెల్త్ (డబ్ల్యుఓఏహెచ్) రెఫరెన్స్ ల్యాబొరేటరీని ప్రత్యేకించి లెప్టోస్పిరోసిస్ బ్యాక్టీరియా సమస్యపై పరిశోధనలు చేసి వాటి నివారణ చర్యలకు సిఫారసులు చేయనున్నారు. డైరెక్టర్ డాక్టర్ బల్‌దేవ్ ఆర్ గులాటి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పల్లబ్ చౌదరి ఇతర శాస్త్రవేత్తలతో కలసి గురువారం ల్యాబొరేటరీని అందుబాటులోకి తెచ్చారు. రీజనల్ క్యాంపస్‌లోని హాఫ్ అండ్ హెల్త్ గేట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌ఎస్ పాటిల్, డాక్టర్ బాల మురుగన్, డాక్టర్ సీఎస్ సతీశ్‌గౌడలు పాల్గొన్నారు.



ల్యాబొరేటరీ ప్రారంభంలో డాక్టర్ హిమాన్షు పాఠక్ తదితరులు

సహకారం బలోపేతం

- సొసైటీలను పటిష్టం చేయడానికి చర్యలు
- సేవలను ప్రజలకు చేరువ చేసే యత్నం
- ఆధునిక పరికరాలతో వ్యవసాయానికి అండ
- ఆన్‌లైన్ సేవలతో అక్రమాలకు చెక్
- చురుగ్గా కంప్యూటరైజేషన్ ప్రక్రియ



రాచానపల్లి సొసైటీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సొసైటీలు ఇక పటిష్టంగా మారనున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా రూపాంతరం చేసేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగానే మొదటి దశలో సొసైటీలను కంప్యూటరైజేషన్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ దాదాపుగా తుది దశకు చేరింది. జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ కమిటీ, రాష్ట్ర స్థాయిలో స్టేట్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలతో పాటు జిల్లా స్థాయిలో డీసీడీసీ(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంలతో పాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీలలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి అవినీతి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు ఉపయోగకరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్‌లను వ్యవసాయంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతోంది.

మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసి ప్రజలకు మరిన్ని సేవలు చేరువచేయడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్ని రకాల సేవలను అందించేందుకు యోగిస్తున్నారు. అన్ని రకాల సేవలు అంటే మొబైల్ రీచార్జితో మొదలు విద్యుత్తు బిల్లులు, రవాణాకు టికెట్లు బుకింగ్ ఇలా అన్నీ సీఎస్‌సీ(కస్టమర్ సర్వీస్ సెంటర్) ద్వారా అందించనున్నారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేయనున్నారు. వీటితో జిల్లాలో రాచానపల్లి, పి కొత్తపల్లి పరిధిలో వంకరాజు కాలవ, ఎద్దులపల్లి, పాళ్యంతండా, బొమ్మనహాళ్, బేలేడు, బుక్కరాయసముద్రంలో గోడౌన్లను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను నిల్వచేయనున్నారు. యల్లనూరు, కణేకల్లు ప్రాంతాలతో పాటు నార్పల, ఆమిద్యాల, కూడేరులలో సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించగా, కణేకల్లులో పనులు జరుగుతున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే మందులు అమ్మేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మందుల షాపులను సొసైటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలి విడతలో అనంతపురం డీసీఎంఎస్, రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాల్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించారు.

అద్దెకు ఆధునిక వ్యవసాయ పరికరాలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయంలో ఆధునిక పరికరాలు, యంత్రాలతో పాటు డ్రోన్‌లు ఏర్పాటు చేయనున్నారు. రైతులకు ఖరీదైన ఆధునిక వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేని పరిస్థితుల్లో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో నామమాత్రపు అద్దెతో వీటిని అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనలు ఇప్పటికే జిల్లా నుంచి ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ఈ ఆలోచన అమలుచేస్తే జిల్లాలో, రాష్ట్రంలో వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెరిగే అవకాశం మెండుగా కనిపిస్తోంది.

కొలిక్కి వచ్చిన కంప్యూటరైజేషన్

సొసైటీల కంప్యూటరైజేషన్ ఇప్పటికే ఓ కొలిక్కివచ్చింది. మొదటి విడతలో ఖాతాలు, రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడి ఇతరత్ర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండో విడతలో ఆడిట్‌లో ఇతరత్ర అంశాలను నమోదు చేయనున్నారు. మూడో విడతలో 2024ఏప్రిల్ 1 నుంచి క్యాష్ డిపాజిట్ ఇతర లావాదేవీలు నమోదు చేయాలి. నాలుగో విడతలో ఆన్‌లైన్‌లో లైవ్‌లో ఉంచడం చేపట్టనున్నారు. దీంతో సొసైటీలలో అక్రమాలకు తావులేకుండా వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించడం. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసి పీఏసీఎస్‌లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీలతో పాటు సబ్సిడీ ధరలకు రైతులకు ఎరువులు, మందులు, విత్తనాలు విక్రయించడం జరుగుతుంది. ఏప్రిల్ 1 నుంచి సొసైటీలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.



డీసీఓ కార్యాలయం

సభ్యులకు ఈ-కేవైసీ తప్పనిసరి

ప్రాథమిక వ్యవసాయ పరపతి (పీఏసీఎస్)సొసైటీ సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలోని 58సొసైటీలకు సంబంధించి స్పెషల్‌డ్రైవ్ ద్వారా గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ-కేవైసీ చేయించుకోని సభ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి చేకూరదు. గ్రామ-వార్డు సచివాలయాలలో వేలిముద్రలు, ఇతరత్ర పత్రాలను అందజేసి ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 1వతేదీ తరువాత సొసైటీలలో అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని, ఈ-కేవైసీ లేకుండా ఎటువంటి లావాదేవీలు చేయడానికి అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సొసైటీలతో రైతులకు బహుళ ప్రయోజనాలు



ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల సేవలను వినియోగించుకోవడానికి సభ్యులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ-వార్డు సచివాలయాలలో రైతులు (సభ్యులు) ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాటు చేశాం. సొసైటీలలో పారదర్శక సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ దోహదం చేస్తుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

జబ్బొస్తే.. అంతే..!

- పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత
- 2024-25 బడ్జెట్ కేటాయించని వైనం
- ముగిసిన మందుల సరఫరా కాంట్రాక్ట్
- ఇబ్బందిపడుతున్న పాడి రైతులు

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పశువుల ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని జబ్బలు చరిచే ప్రభుత్వాలు కనీసం మందులు కూడా అందించలేని దుస్థితిలో ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పశువుల ఆస్పత్రులు 15, డిస్పెన్సరీలు 56, గ్రామీణ పశువైద్యశాలలు 14, రైతు సేవా కేంద్రాలు 367 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆవులు 2,15,896, గేదెలు 1,89,843, గొర్రెలు 22,97,300, మేకలు 4,12,094, కోళ్లు 10,36,664 ఉన్నాయి. వీటన్నింటికి ఏడాదికి మందుల కోసం రూ.2.50కోట్ల బడ్జెట్ వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో వైద్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వైద్యుల కొరత కూడా ఉండటంతో పలు ఆసుపత్రుల్లో అటెండర్లే వైద్యం చేస్తున్నారు. 2024-25కు సంబంధించి పశువుల మందుల కోసం గత ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రెండు త్రైమాసికాలకు బడ్జెట్ కేటాయించినా మందులు మాత్రం సరఫరా చేయలేదు. దీంతో ఏ చిన్న సమస్యపై ఆస్పత్రులకు పశువులను తీసుకువెళ్లినా ఇక్కడ మందులు లేవని, డాక్టర్లు బయటకు పంపిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే రేట్ కాంట్రాక్టర్ సమయం డిసెంబరు ఆఖరికే పూర్తయినట్లు కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మరో కాంట్రాక్టర్‌ను పిలిచి, టెండర్ వేసి, మందులు సరఫరా చేయాలంటే దాదాపు 3నుంచి 4నెలలు సమయం పడుతుంది. అందుకే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి మందుల కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు



పశువైద్యశాల



డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు. కానీ ఆస్పత్రిలో కొన్ని రకాల మందులు లేకపోవడంతో పాడిరైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో పాడిపై ఆధారపడిన రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే పశువులకు వచ్చే జబ్బులకు ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతుంది.

- లక్ష్మణ్, తాడిపత్రి

మందులు బయటకు రాసిస్తున్నారు..

ఆస్పత్రికి పశువులను తీసుకొస్తే కొన్ని మందులు ఇక్కడ ఉన్నాయి. కొన్ని మందులు లేవని బయటకు పంపిస్తున్నారు. ఆసుపత్రిలోనే పశువులకు మందులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ప్రశ్నిస్తే మందులు ఉంటే మేమెందుకు ఇవ్వమని, ఉన్నవాటినే సర్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో చేసేదేమిలేక బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నారాయణరెడ్డి, తాడిపత్రి

సాధ్యమైనంత వరకు మందులు ఇస్తున్నాం..



గొర్రెలు, మేకలు, కుక్కల టీకాలకు మందులు తక్కువ లేకుండా వివిధచోట్ల తెప్పించుకుంటున్నాం. కానీ కొన్ని మందులు లేవన్నది వాస్తవమే. ప్రస్తుతం మందుల కొరత ఉండటంతో ఇండెంట్ పెట్టాం. కానీ మందులు వచ్చేంత వరకు సర్దుకుంటూ వైద్యం చేస్తున్నాం.

- ఖాదర్‌బాషా, వైద్యుడు

కలెక్టర్ దృష్టికి సమస్యలు

- ఆకాశవాణి 'అనంతమిత్ర'లో
- ఫిర్యాదుల వెల్లువ

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించిన 'అనంత మిత్ర'కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గురువారం ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం7-45 గంటల నుంచి 8-15 వరకు సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా అనంతపురం రామచంద్రనగర్‌కు చెందిన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ నగరపాలక పాఠశాలలో తన కూతురు చదువుతోందని, టీచర్లు డ్యూటీకి రావడంలేదన్నారు. కమిషనర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. లలితనగర్‌కు చెందిన శారదా మాట్లాడుతూ.. బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్‌వరకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి అపరిశుభ్రంగా ఉందన్నారు. లలితనగర్‌లో 200 ఇళ్లు ఉన్నాయని, రోడ్డు, తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నామని చర్యలు తీసుకోవాలని కోరారు. నగరానికి చెందిన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులు సరిగా నిర్వహించడంలేదన్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరారు. యాడికికి చెందిన గురుమూర్తి మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని పరిష్కరించాలని కోరారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఇస్సాంరెడ్డి మాట్లాడుతూ.. ముగ్గురికి కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని అనుమతులు ఇచ్చినా ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదని ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులును ఓపికగా విన్న కలెక్టర్ వినోద్ కుమార్ వాటిని ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పర్కిరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అటవీ స్థలాలను కాపాడుకోవాలి

- వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- డీఎఫ్ఓ విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ స్థలాలను కాపాడుకోవాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం రేంజ్ పరిధిలోని సిబ్బందికి అటవీ స్థలాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పంపనురులోని నగరవనం సమావేశ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎఫ్ఓ మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అడవిలో వన్యప్రాణుల నుంచి స్థానిక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అటవీశాఖ స్థలాలు, నాటిన మొక్కలు, అడవిలోని వన్యప్రాణులను ఏ విధంగా కాపాడవచ్చో వివరించారు. అనంతరం మరుట్ల సౌత్ బీట్‌కు వెళ్లి అక్కడ నాటిన మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది వారికి ఉన్న సమస్యలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. మరుట్ల సౌత్‌బీట్‌లో 20 హెక్టార్లలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ శిక్షణలో రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్స్ నీలవేణి, తేజేశ్వర్‌రెడ్డి, జగదీష్, శ్రీకాంత్, రవిచంద్రారెడ్డి, ఏబీఓలు గిరీష్, రామ్మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి కరువు బృందం పర్యటన..?

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటనష్టంపై అధ్యయం కోసం సెంట్రల్ మినిస్ట్రీయల్ బృందం (కరువు బృందం) ఈనెల 7వతేదీ నుంచి ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఇదివరకు ఈనెల 2, 3 తేదీల్లో కరువు బృందం ఉమ్మడి జిల్లాలోని కరువు మండలాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్ ఖరారైంది. అనివార్య కారణాలతో పర్యటన వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈనెల 7 నుంచి 9వతేదీ వరకు రాష్ట్రంలో కరువు బందం పర్యటించనున్నట్లు ఈ మేరకు గురువారం షెడ్యూల్ ఖరారైనట్లు తెలిసింది. తొలుత ఉమ్మడి జిల్లాలోనే కరువు బృందం సభ్యులు పర్యటించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ రాప్తాడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. మండలస్థాయి నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి గణితం, సైన్స్ ప్రాజెక్టులు సుమారు 70 వరకూ జిల్లా సైన్స్ ఫెయిర్‌కు వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రాజెక్టుల ఎంపిక మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. జిల్లా సైన్స్ ఫెయిర్ నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు 6 ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నారు.



పైకప్పు పెచ్చులూడి బయట పడిన ఇనుప కడ్డీలు

శిథిలావస్థలో మార్కెట్ భవనం

- ఊడుతున్న పైకప్పు పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- మూలుగుతున్న రూ.60 లక్షల నిధులు



ఊడుతున్న పెచ్చులు

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం శిథిలావస్థకు చేరుతోంది. భవన నిర్మాణం జరిగి అర్ధ శతాబ్దం కావస్తోంది. భవనానికి చాలా చోట్ల పెచ్చులూడిపోయాయి. గోడల్లోని ఇనుప కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల గోడలు బీటలు వారాయి. దీంతో కార్యాలయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఇంతలోనే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ప్రస్తుత ప్రజాప్రతినిధులు చొరవచూపితే నూతన భవన నిర్మాణానికి మోక్షం కలుగుతుంది.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

గతంలో కార్యాలయ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరిగాయి. 1977లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2008లో భవనానికి మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో వివిధ పాలకవర్గ సభ్యుల కాలంలో ఎవరికి వారు పనులు చేయించుకుంటూ వెళ్లారు. 2009లో అతిథి గృహం నిర్మించారు. 2012లో సమావేశ మందిరం ప్రారంభించారు. ఈవిధంగా అప్పటి పాలకవర్గ సభ్యులు నిర్మాణాలు చేయించారు. పాత భవనాన్నే ఆధునీకరించారు. ఈ క్రమంలో రూ.లక్షలు ఖర్చు చేశారు. ఏళ్లు గడిచిపోవడంతో చాలా చోట్ల భవనం దెబ్బతినింది. అతిథి గృహ గదులు పాత బంగ్లాలను తపిస్తున్నాయి. దీనికితోడు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి.

పాలకులు చొరవచూపితేనే..

గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. యార్డులో వివిధ నిర్మాణాల నిమిత్తం 2022లో దాదాపు రూ.12 కోట్లు కేటాయించారు. ఇందులో నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించారు. నిధులు కూడా మంజూరయ్యాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నూతన భవన నిర్మాణానికి మోక్షం లభించలేదు. దీంతో కమిటీ ఖజానాలో నిధులు మూలుగుతున్నాయి. ప్రస్తుత పాలకులు, అధికారులు చొరచూపితే నూతన భవన నిర్మాణం జరిగే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నూతన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు యార్డులోని వివిధ నిర్మాణాల గురించి పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈనెల 8న మార్కెటింగ్ శాఖ మంత్రి గుంటూరులో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిర్మాణాలపై చర్చించే అవకాశం ఉంది. మేము కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెట్ కమిటీ

న్యూస్ బాక్స్

నేటి నుంచి ఎస్ఎస్‌బీఎన్ వసంతోత్సవాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో మూడు రోజుల పాటు నిర్వహించే 80వ వసంతోత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం పాఠశాలకు సంబంధించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం, శనివారం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనం, ఆదివారం డిగ్రీ, పీజీ పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం, సన్మానాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హాజరవుతున్నారన్నారు.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు, జనవరి2(ఆంధ్రజ్యోతి): ఉత్తర రైల్వేలోని జమ్మూతావిలో జరుగుతున్న యార్డు పనుల కారణంగా తిరుపతి-జమ్ముతావి-తిరుపతి (వయా గుంతకల్లు) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఒక ట్రిప్పును రద్దు పరుస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-జమ్మతావి (నం. 22705) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22706)ను ఈనెల 10వ తేదీన రద్దు చేయనున్నట్టు పేర్కొన్నారు.

అభ్యంతరాలకు నేడే ఆఖరు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాపై శుక్రవారం సాయంత్రంలోగా అభ్యంతరాలు తెలియజేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రమోషన్లు ఇస్తున్నామన్నారు. ప్రమోషన్లకు అర్హులైన టీచర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ బ్లాగ్ స్పాట్‌లో ఉంచామని తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సాయంత్రం 5 గంటలలోగా తగిన ఆధారాలతో హెచ్ఎం, ఎంఈఓల ద్వారా తెలియజేయాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కడప జోన్ పరిధిలో 150 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 17వతేదీ వరకు పని రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ఎమ్మార్పీ పోస్టు కోసం..

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-సీడాప్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలు సంయుక్తంగా పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్‌ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద పనిచేయడానికి మండల రిసోర్స్ పర్సన్ పోస్టుల నియామకాలకు ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. డిగ్రీ చదివి, కంప్యూటర్, ఇంటర్‌నెట్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్ కలిగి ఉండి 21-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8న అనంతపురం పంగల్‌రోడ్డు సమీపంలోని టీటీడీసీలో రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లాలోని ఎంపికైన మండలంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికవేత్తలకు అవగాహన కల్పించడం, పరిశ్రమల ఏర్పాటు, పురోగతి సాధించడానికి సహకరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయడానికి రూ.20వేలు పారితోషికం చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 8985091256, 8639439808, 8639448535లను సంప్రదించాలన్నారు.

8న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, వర్క్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు.

మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ప్రొఫెసర్ బీఎంశ్రీ (జయంతి)



బెళ్ళూరు మైలారయ్య శ్రీకంఠయ్య (బీఎంశ్రీ) 1884 జనవరి 3న మండ్య జిల్లా నాగమంగల తాలూకా బెళ్ళూరులో జన్మించారు. జాతీయకవి కువెంపుచే 'నవయుగద ప్రవర్తక'గా పేరొందారు. ఆధునిక కన్నడ సాహిత్యానికి ఎంతో కృషి చేశారు. రచనల్లోనూ, అనువాదంలోనూ సరికొత్త ఒరవడి సృష్టించారు. కర్ణాటక ఏకీకరణ, ఆచార్య, కన్నడకణ్వలకు ఆయన ప్రతీకగా నిలిచారు. 1946 జనవరి 5న కన్నుమూశారు.

నిడుదవోలు వేంకటరావు (జయంతి)




తెలుగులో కదిలే ఎన్‌సైక్లోపీడియాగా పేరొందిన నిడుదవోలు వేంకటరావు 1903 జనవరి 3న విజయనగరంలో పండిత కుటుంబంలో జన్మించారు. సాహితీ విమర్శకులు, ప్రాచీన గ్రంథ పరిష్కర్త. పరవస్తు చిన్నయసూరి, కొప్పరపు సోదర కవుల జీవితచరిత్రలు రాశారు. తెలుగు భాషా సమితి, సాహిత్య అకాడమీలనుంచి పురస్కారాలు అందుకున్నారు. విద్యారత్న, పరిశోధన పరమేశ్వర, కళాప్రపూర్ణ గౌరవాలు అందుకున్నారు. 1982 అక్టోబరు 15న కన్నుమూశారు.

ఎంఎస్ గోపాలకృష్ణన్ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత ఎంఎస్ గోపాలకృష్ణన్ 1931 జూన్ 10న చెన్నైలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో వయోలిన్ వాదనలో నిష్ణాతులు. 8వ యేటనే ప్రతిభ చాటుకున్నారు. లాల్‌గుడి జయరామన్, టీఎన్ కృష్ణన్‌లతో కలసి త్రయంగా పలు కచేరీలు ఇచ్చారు. 50ఏళ్ల పాటు ఈరంగంలో కొనసాగడం విశేషం. పద్మశ్రీ, కళైమామణి, సంగీతనాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2013 జనవరి 3న కన్నుమూశారు.

మైఖేల్ షూమాకర్ (పుట్టినరోజు)



జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ రేసింగ్ డ్రైవర్ మైఖేల్ షూమాకర్ 1969 జనవరి 3న జన్మించారు. జోర్డాన్, బెనెట్టన్, ఫెరారి, మెర్సిడెస్‌లలో ఫార్ములా వన్ పోటీలలో పాల్గొన్నారు. ఏడు వరల్డ్ డ్రైవర్స్ ఛాంపియన్ షిప్ టైటిల్స్ గెలుచుకున్నారు. 91 పోటీలలో విజేతగా నిలిచారు. 2012లో క్రీడలకు రిటైర్మెంట్ ప్రకటించారు. యునెస్కో రాయబారిగా వ్యవహరించారు. పలు చారిటీ కార్యక్రమాలకు చేయూతను అందించారు. 2019లో ప్రమాదంలో మెదడుకు గాయాలు కావడంతో చాలాకాలం ఆసుపత్రికే పరిమితం అయ్యారు. 2022లో నార్త్‌రైన్ వెస్ట్ ఫాలియా అవార్డు అందుకున్నారు.

రోడ్డుపైనే చెత్త..



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

బళ్లారిరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని శ్రీధరఘడ్డ గ్రామంలో మూడో వార్డు సమీపంలో కప్పగల్‌కు వెళ్లే రహదారి రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామస్థులు పలుసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. చెత్తాచెదారంతో డ్రైనేజీ సమస్య దుర్వాసనతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధ్యక్షుడు వారి దృష్టికి తీసుకువెళ్లి ఇంతవరకు ఈ సమస్యను పరిష్కరించే నాథుడు లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శ్రద్ధ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

9న మెగా జాబ్‌మేళా

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీఎన్‌బీ కల్యాణమండపంలో ఈనెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 90 దాకా బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, పీజీ చదివన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

చెల్లెలిని హత్యచేసిన అన్న

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దోసకాయ విషయంలో అన్నాచెల్లెళ్ళ మధ్య తలెత్తిన వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరి ఏకంగా సొంతచెల్లెలినే దారుణంగా హత్య చేసిన సంఘటన చామరాజనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని కొళ్ళేగాల ఈద్గా మొహల్లా వీధిలో నివసించే సయ్యద్ పాషా ఇంట్లో బుధవారం రాత్రి దారుణం జరిగింది. రాత్రి భోజనం వేళ చెల్లెలు ఇమాన్‌భాను అన్న కుమారుడికి దోసకాయ తినిపించేందుకు ప్రయత్నించారు. పిల్లాడికి జ్వరం వస్తోందని దోసకాయ ఇవ్వరాదంటూ అన్న ఫర్మాన్ మందలించారు. ఇదే విషయంలో అన్నాచెల్లెళ్ళ మధ్య తలెత్తిన వాగ్వాదం తీవ్ర రూపం దాల్చింది. అంతలోనే ఆగ్రహానికి లోనైన ఫర్మాన్ ఏకంగా కత్తి తీసుకువచ్చి ఇమాన్‌భాను గొంతుకోసి హతమార్చాడు. కేకలతో పాటు రాద్ధాంతం కావడంతో మరోగదిలో ఉండే ఫర్మాన్ భార్యతో పాటు తండ్రి అడ్డుకునేందుకు రాగా వారిపైనా దాడికి పాల్పడ్డారు. ఇంట్లో తీవ్రమైన కేకలు వినిపిస్తుండటంతో స్థానికులు రాగా ఫర్మాన్ ఓగదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నారు. వెంటనే గాయపడిన ఇద్దరినీ చామరాజనగర్ ఆసుపత్రికి తరలించారు. ఈలోగానే పోలీసులకు ఫోన్ చేసి ఫర్మాన్ లొంగిపోయారు. కొళ్ళేగాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే సాంకేతిక విద్యకు ఎంతో ప్రఖ్యాతిగాంచిన జేఎన్టీయూ గత వైసీపీ హయాంలో కునారిల్లింది. మితిమీరిన రాజకీయ జోక్యం, కొన్ని అదృశ్య శక్తులు వర్సిటీ ప్రతిష్టను మసకబార్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఆరునెలల్లోనే పరిస్థితులు చాలా వరకు మారాయి. గత వైసీపీ పాలనలో ఉన్నతాధికారుల మధ్య వైరాన్ని సృష్టించి రెండుగా చీల్చారు. ఆకస్మిక బదిలీలు, ఆలస్యంగా ఉద్యోగోన్నతులు, ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ప్రతిభ, అర్హతకు పాతరేసి, తమకు నచ్చిన వారికే ఉద్యోగోన్నతులు, ఉన్నత పదవులు, కీలక స్థానాలు కట్టబెట్టడంలో అదృశ్య శక్తులు పనిచేశాయి. ఆ అరాచకాలకు చరమగీతం పాడుతూ జేఎన్టీయూ.. మరోసారి అభివృద్ధి వైపు పయనిస్తోంది. పారదర్శకమైన పాలన లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం సెంట్రల్



జేఎన్టీయూ పరిపాలనా భవనం

రాచకం నుంచి అభివృద్ధి వైపు..

విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమం దిశగా జేఎన్‌టీయూ



వర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు వేలాదిమంది విద్యార్థులు, వందలాదిమంది ఉద్యోగులపై ప్రభావం చూపుతాయి. జేఎన్టీయూ పరిధిలోని అనంతపురం, చిత్తూరు,

పారదర్శకమైన నిర్ణయాలు...

కడప, కర్నూలు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్ 72, ఫార్మసీ 45, ఎంసీఏ, ఎంబీఏ 67.. ఇలా మొత్తం 184 కళాశాలల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ప్రవేశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్ల జారీ.. ఇలా అనేక అంశాల్లో వర్సిటీ యాజమాన్య నిర్ణయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గత వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు, ఉద్యోగులు, కళాశాలలు కునారిల్లాయి. వాటికి చరమగీతం పాడుతూ నూతన యాజమాన్యం పారదర్శమైన పాలన సాగిస్తోంది.

పారదర్శక పాలన లక్ష్యంగా నిర్ణయాలు

కూటమి రాకతో వర్సిటీలో మార్పులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్

విద్యార్థుల భవిష్యత్తుకు నాంది..

ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏలోని పలుకోర్సులను జేఎన్టీయూ అందిస్తోంది. ప్రతియేటా వేలాదిమంది డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగ కల్పనను ఎండమావిగా మారింది. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం పొంది జీవితంలో స్థిరపడాలన్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను కలగానే మిగిల్చారు. వారి కలలను సాకారం చేసేలా కొత్త యాజమాన్యం ప్రయత్నాలు సాగించింది. కియ సంస్థ ప్రతినిధులతో చర్చించి తమ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదించి వాటికి అవసరమైన రీతిలో విద్యార్థులకు శిక్షణ చేపట్టింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. విద్యార్థులను ఉద్యోగాలకు సన్నద్ధం చేసేలా క్లబ్‌లను ఏర్పాటు చేసి కోఆర్డినేటర్లుగా ఫ్యాకల్టీని నియమించింది.



ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడంతో వీసీ సుదర్శనరావుని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం..

ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమవుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పెరిగిన జీతాలను జమచేశారు. ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదలచేశారు. అర్హత, అనుభవం ప్రాతిపదికగా బదిలీలు చేశారు. ప్రమోషన్లు ఇచ్చేందుకు మెరిట్ జాబితాను రూపొందించారు. ఇలా అనేక సమస్యలను నూతన యాజమాన్యం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడు బదిలీ వస్తుందో తెలియని పరిస్థితి. నిత్యం అభద్రత నడుమ విధులు నిర్వహించారు. ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలకు బలికావాల్సి వచ్చేది. గొంతువిప్పిన వారిపై వేటువేసేవారు. ఒక మాజీ వీసీ, రాష్ట్రస్థాయిలో కీలకంగా వ్యవహరించిన మరో అధికారి వర్సిటీని వెంటాడి తమ జీవితాలతో ఆటాడుకున్నారని ఉద్యోగ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, హాస్టల్ నిర్వహణ, సరకుల సరఫరా.. ఇలా ఏదైనా వారి వర్గానికి దక్కించుకుని లబ్ధిపొందారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్వవైభవాన్ని తీసుకువస్తున్నాం..

విశ్వవాప్తంగా కీర్తిని చాటిన వర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తున్నాం. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే విశ్వవిద్యాలయాలపై గత ప్రభుత్వం కక్షిసాధింపు ధోరణి అవలంబించింది. అడ్డగోలు నిర్ణయాలతో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలను నీరుగార్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు సమస్యలను వివరించడంతో సానుకూలంగా స్పందిస్తున్నారు. ఈ మేరకు రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాం. టీచింగ్ అసిస్టెంట్స్‌కు పెరిగిన జీతాలిచ్చాం. వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాం. కియ కంపెనీతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను సంప్రదించి ఎంఓయూలు చేసుకుంటున్నాం.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, ఇన్‌చార్జ్ వీసీ



గందరగోళంగా నగరసభ సమావేశం

రాయచూరు జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాయచూరు నగరసభను మహానగర పాలికగా అప్‌గ్రేడ్ చేస్తు ప్రభుత్వం ప్రకటించిన అనంతరం గురువారం నిర్వహించిన తొలిసభ గందరగోళంగా సాగింది. ప్రత్యేకించి నగర స్వచ్ఛతకు సంబంధించి ఏర్పాటు చేసిన ఈ సభలో అధికార పార్టీకి చెందిన సీనియర్ సభులే సభ నుంచి వెళ్లిపోవడంతో ఒక్కసారిగా సభలో గందరగోళం రేగింది. దీంతో అధికార పక్షానికే సభ పట్ల గౌరవం లేనప్పుడు తామెందుకు ఇక్కడంటు బీజేపీ సభ్యులు ఇ శశిరాజ్ నేతృత్వంలో సభ నుంచి వాక్ అవుట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. సభలో మాట్లాడిన జేడీఎస్‌కు చెందిన సీనియర్ సభ్యుడు హరీశ్ నాడగౌడ, నగరసభ అధికారులు పాలక పక్షం వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర అభ్యంతరం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ అధ్యక్షతన సభ సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ సభ్యులు జయణ్ణ, దరూర్ బసవరాజ్‌లు ఎలాంటి లిఖితపూర్వక అజెండా లేకుండా ఏ ప్రాతిపదికన సమావేశం ఏర్పాటు చేశారంటు ప్రశ్నించారు. కేవలం మౌఖికంగానే కమిషనర్ ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కమిసనర్ బదిలిస్తుండంగానే వారిద్దరు సభ నుంచి లేచి బయటికి వెళ్లిపోయారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

విజయనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జగజ్జీవన్‌రామ్‌నగర్ ఐపీడీ సాలప్ప లే అవుట్‌లోని శబరిగిరి అయ్యప్పస్వామి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో జ్ఞానాక్షి భువనేశ్వరి దేవికి విశేషపూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి పూజలు, అలంకరణ అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. జ్ఞానాక్షి భువనేశ్వరి ఆలయ సేవా ట్రస్టు సభ్యులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి

సువర్ణసౌధ ఘటనపై సీటీ రవి ఆగ్రహం

- జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు...?
- బెళగావి పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణసౌధలో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ అనుచరులు గుండాల తరహాలో ప్రవర్తించి దాడికి పాల్పడిన విషయమై బెళగావి పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి తీవ్రంగా మండిపడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చెందిన వారికి ఓ చట్టం ఇతరులకు మరో చట్టం అనేలా మారిందని ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. సువర్ణసౌధలోనే దాడి జరుగడంతో పాటు ఆవెంటనే పోలీసులకు దాడికి సంబంధించి ఫిర్యాదు చేసి 15 రోజులైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో జాతీయ మానవహక్కుల కమిషన్‌కు వెళ్ళేందుకు సీటీ రవి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అందుకు వ్యూహాత్మకంగానే ఇటీవల గవర్నర్‌తో పాటు డీజీపీలను కలిసి బెళగావి పోలీసుల తీరు, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, డీసీఎం డీకే శివకుమార్‌ల ప్రోత్సాహంపైనా వినతి పత్రం ఇచ్చారు. జాతీయ మానవహక్కుల కమీషన్‌కు వెళ్ళేందుకు ముందుగా న్యాయనిపుణుల సలహాలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ విధానపరిషత్, సువర్ణసౌధలలో జరిగిన వివాదం సభాపతి, బెళగావి పోలీసుల పరిధిలోనే ఉండా జాతీయ మానవహక్కుల కమీషన్ దాకా వెళితే మరిన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందనిపిస్తోంది. మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ఫిర్యాదును గంటలోపుగానే కేసు నమోదు చేసిన పోలీసులు ఏకపక్షంపై జాతీయ కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళదలచినట్లు సమాచారం.


తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- సీనియర్ వైద్యురాలు డాక్టర్ శైలజ ఎన్

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రాధాన్యత పెంచామని రెయిన్‌బో ఆసుపత్రులు ప్రాధాన్యం ఇస్తున్నాయని సీనియర్ కన్సల్‌టెంట్ శైలజా ఎన్ అభిప్రాయపడ్డారు. నగరంలోని బన్నేరుఘట్ట రోడ్‌లో నాల్గవ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆరంభించారు. ఇదే సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడారు. డాక్టర్ శైలజా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 సాఫల్య కేంద్రాలకు పెంచామని నగరంలో నాల్గవశాఖను తెరువడం సంతోషంగా ఉందన్నారు. రెయిన్‌బో ఆసుపత్రులు శిశు మరణాలు తగ్గించడంతో పాటు కాన్పు తర్వాత బాలింతల ఆరోగ్య సంరక్షణకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో సంతానలేమితో బాధపడేవారికి తగిన చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. డాక్టర్ రీచా దఫ్తారీ మాట్లాడుతూ ఒకే చోటున సంతాన సాఫల్యానికి సంబంధించిన అన్ని సదుపాయలు ఉండేలా కేంద్రాన్ని తెరిచామన్నారు. డాక్టర్ సుష్మా బీ ఆర్ మాట్లాడుతూ సంతానం లేక పోవడానికి ఆలస్యంగా వివాహాలు, స్థూలకాయం, వృత్తి, ఉద్యోగాలలో ఒత్తిడి, సమగ్రత లేని జీవనశైలితో పాటు వంశపారంపర్యత ఉండవచ్చు అన్నారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు ఉండాలనే ప్రత్యేక కేంద్రం తెరిచినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ మహిళా జట్టులో అనూషా

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళా సీనియర్ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూషా ఎంపికయింది. ఆత్మకూరుకు చెందిన అనూషా 2015 నుంచి ఫుట్‌బాల్ ఆడుతోంది. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. గతేడాది కూడా అండర్-19 భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్‌లో సాధన చేసుకుంటూ...ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బెంగుళూరులో శుక్రవారం మాల్దీవులతో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత అండర్-20 మహిళా ఫుట్‌బాల్ జట్టు తరఫున అనూషా ప్రాతినిధ్యం వహించనుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.09	1,589.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	110	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,844	0
నీటి నిల్వ (టీఎంసీలు)	80.11	12.27

తాగునీటిలో పురుగులు ప్రత్యక్షం

● చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు, నీటిలో పురుగులు

బళ్లారిరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని మోకా గ్రామంలో తాగునీటిలో పురుగులు ప్రత్యక్షం కావడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం గ్రామస్థులు మాట్లాడుతూ ఇటీవల తాగు నీటి కొళాయిల్లో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదని, అధికారులు ట్యాంకును శుభ్రం చేయాలని కోరుతున్నారు. స్వచ్ఛమైన నీటిని వదలకపోవడంతో రోగాల బారిన పడుతున్నామన్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యమని వాపోయారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయక పోవడంతోనే పురుగులు వస్తున్నాయని అన్నారు.

ఆస్పత్రి తనిఖీ


కట్టడం పనులను పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ అధికారి

కంప్లి, జనవరి 2(ఆంధ్ర జ్యోతి): కంప్లిలోని ముద్దాపూర గ్రామ పంచాయతీ పరిధి వద్ద నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి పనులను జిల్లా ఆరోగ్య శాఖ అధికారి రమేష్ బాబు పరిశీలించారు. గురువారం జరుగుతున్న పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. కంప్లి తాలుకాలోని గ్రామ ప్రజలకు అనుకూలంగా ఆస్పత్రి ఏర్పడబోతుందన్నారు. ఈ ఆస్పత్రి వల్ల ప్రజలకు ప్రతి వైద్యులు అందుబాటులో వుంటారని తెలిపారు. ఏప్రిల్ నెలలో ఈ ఆస్పత్రిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారితో పాటు డాక్టర్ అరవింద్ కుమార్, మంజునాథ్, రవీంద్ర కనికేరి, డాక్టర్ శ్రీనివాస్, వీరేష్, బసవరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేద్దాం

కంప్లి, జనవరి 2(ఆంధ్ర జ్యోతి): కంప్లి పట్టణంలో శారదా పాఠశాలలో ఈ నెల 4న బీజేపీ నాయకులు ఏర్పాటు చేసే వక్ఫ్ హఠావో దేశ్ కో బచావో జన జాగృతి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నాగరిక హిత రక్షణ సమితి సంచాలకులు భరత్ తెలిపారు. రాష్ట్రంలో వక్ఫ్ పేరుతో రైతులు చేపడుతున్న భూములను స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది. దానికి విరుద్ధంగా 4వ తేదీన బీజేపీ నాయకులు బసనగౌడ పటేల్ యత్నాల్, రమేష్ జార్కిహొళి, అరవింద్ కుంబావళి, కుమార బంగారప్ప, సిద్దేష్, బీపీ నాయక్, ప్రతాప్ సింగ్, చంద్రప్ప, హరీష్, భరత్, రవి బీరదార్, సంతోష్ ఆధ్వర్యంలో ఉద్యమ గణపతి నుంచి పాఠశాల వరకు బహి ఎత్తున వక్ఫ్‌కు విరుద్ధంగా కార్యక్రమం నిఙ శారదా పాఠశాలలో 4వ తేదీన సమావేశం జరుగుతుంది. ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంజునాథ్, శంభులింగ, ఉలేష్, రామాంజిని, శ్రీనివాస్, సతీష్, చంద్రశేఖర, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చేసింది కొండంత.. చూపింది గోరంత..!

● సండూరు ఉప ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు పెట్టింది రూ.40 లక్షల లోపేనట ● ఎన్నికల కమిషన్‌కు పద్దుల సమర్పణ


ఎమ్మెల్యే అన్నపూర్ణ కాంగ్రెస్


బంగారు హనుమంత (బీజేపీ)

బళ్లారి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది నవంబరు మాసంలో రాష్ట్రంలో శాసనసభ ఉప ఎన్నికలు జరిగాయి. బళ్లారి జిల్లా సండూరు, చన్నపట్న, శిగ్గావి ఈ మూడు చోట్ల జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఇరు పార్టీలు గెలుపుకోసం సర్వ శక్తులా ఉపయోగించిన సంగతి తెలిసిందే. ధనబలం, అధికార బలం రెండూ శక్తికి మించి ఎన్నికల్లో వినియోగిస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు బహిరంగంగానే విమర్శించుకున్నారు. గెలుపు కోసం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని రెండు పార్టీలు ఆరోపణలు చేసుకున్న సంగతి తెలిసిందే. అభ్యర్థులు ఎన్నికల కమిషన్‌కు ఖర్చు ఖాతాలను అందజేయాల్సిన అవసరం ఎంది. అయితే ఇక్కడే అసలు తమాషా మొదలయ్యింది. అభ్యర్థులు సమర్పించిన ఖాతాలు చూస్తుంటే నిజమేనా..అనిపించక మానదు. సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున బంగారు హనుమంత, కాంగ్రెస్ తరుపున ఈ అన్నపూర్ణ బరిలో ఉన్నారు. 2024 నవంబరు 13న ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సంబంధించి ఎన్నికల అధికారలకు వీరి ఖర్చుల పద్దులను సమర్పించారు.

కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ రూ. ఆకరాలా 26.లక్షల.96వేలా 202 వ్యయం చేశారట..కమిషన్‌కు సమర్పించిన పద్దులో ఇవే తెలియపరచారు. మామూలు ర్యాలీకి రూ. 4,32,62, స్టార్ క్యాంపెయినర్లు ఉన్న ర్యాలీకి రూ. 9,79,591, ప్రచార సామాగ్రికి రూ. 1, 48. 349. ప్రచార వాహనాలకు రూ. 4,19,100, ఇతర ఖర్చులు రూ. 4,90,700 మొత్తం రూ. 26 లక్షలు, 96వేల 202 ఖర్చు చేసినట్లు పద్దులో తెలియజేశారు.

ఇక బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత ఈ ఎన్నికల్లో రూ. 24లక్షల 97వేలా 564 ఖర్చు చేసినట్టు అఫిడవిట్‌లో చూపారు. ర్యాలీ, స్టార్ క్యాంపెనర్ల ప్రచారానికి రెండు కలిపి రూ. 12,90 344 అయినట్లు, వాహనాలు, బ్యానర్లు, ఇతర ఖర్చులు మొత్తం కలిపి రూ. 24 లక్షల, 97 వేలా 564 మాత్రమే ఖర్చు అయినట్టు లెక్కలు చూపారు. మరో విషయం ఏమిటంటే ఏ ఒక్క మీడియాకు ప్రకటనలకు ఒక్కరూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం విశేషం, మామూలుగా కేంద్ర ఎన్నికల ఖర్చు నిబంధనల ప్రకారం 2022లో నవరించిన ఖర్చు పద్దుల ప్రకారం అభ్యర్థి రూ. 40 లక్షల వరకూ వ్యయం పెట్టుకోవచ్చు..కానీ ఆమేరకు ఖర్చు కాకపోవడం విశేషం.

ఇది ఇలా ఉంటే మరి కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇక్కడే ఉండి ప్రచారం సాగించారు. రెండు పార్టీల నాయకులూ ఒకరు మించి ఒకరు వివరీతంగా ధన వ్యయం చేస్తున్నారు. అని రెండు పార్టీల నాయకులూ బహిరంగ ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి కాంగ్రెస్ నాయకులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. ఇక కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది కాబట్టి బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం విచ్చల విడిగా వ్యయం చేస్తున్నారు అని పేర్కొన్నారు. పైగా ఉప ఎన్నికలు జరిగిన మూడు స్థానాల్లో కాంగ్రెస్ , బీజేపీ అభ్యర్థులు డీ అంటే డీ అనే రీతిలోనే తలబడ్డారు. మరి పార్టీల అభ్యర్థులు ఇచ్చిన అఫిడవిట్ ఎంత వరకూ సత్యం అనేది ఎన్నికల పరిశీలకులే తేల్చాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక పోటీలో ఉండే ఇతర అభ్యర్థులు కూడా టీ.ఎం మూర్తి రూ.77,320, ఎన్. అంజినప్ప రూ. 5000, ఎన్. వెంకయ్య రూ. 5,24,303, టీ. ఎర్రిస్వామి రూ. 3,48,059 వ్యయం చేసినట్టు ఎన్నికల చూపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శశిధర కొసాంబె

● రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యుడు శశిధర కొసాంబె

బళ్లారి సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ మనదరి బాధ్యత అని కర్ణాటక రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యుడు శశిధర కొసాంబె అన్నారు. రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ బెంగళూరు, జిల్లా న్యాయ సేవల ఆథారిటీతో పాటు పలు శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లాపంచాయతీ హాల్లో పోశాకులతో విద్య, రక్షణ, పిల్లలతో బహిరంగ సంభాషణ స్వాగత కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి బిడ్డకు పుట్టడం, జీవించడం, మంచి ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం పొందడంతోపాటు దేశ పౌరుడిగా గుర్తింపు పొందే హక్కు ఉందన్నారు. ఆర్టికల్ 21ఏ ప్రకారం ఉచిత నిర్బంధ విద్య అనేది రాజ్యాంగ ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత భోజనం, సమతుల్య , పౌష్టికాహారంతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై దురభిప్రాయం విడనాడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య తగ్గుతోందని, ఒక్క కళ్యాణ కర్ణాటకలోనే 60వేల మందికి పైగా పిల్లలు బడి మానేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నివేదిక ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 2012 నుంచి 2024 వరకు 3,800 పోక్సో కేసులు నమోదయ్యాయని, జిల్లాలోని ప్రతి పాఠశాలలో బాలల భద్రత కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. నెలకోసారి బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో పిల్లల హెల్ప్‌లైన్ నంబర్ 1098ను గోడలపై ప్రకటించాలన్నారు.

జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబరు సెక్రటరీ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హోసమని మాట్లాడుతూ బాలబాలికలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు రావాలన్నారు. జీవిత ఆధారిత విలువలతో కూడిన విద్యను పొందడం ద్వారా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలన్నారు. బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ విజయలక్ష్మి మైదూరు మాట్లాడుతూ పిల్లలు తమ భవిష్యత్తును తామే రూపొందించుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్‌లుగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు రామచంద్ర భట్ చిన్నారులతో మాట్లాడారు. పలు సమస్యలపై విద్యార్థులు ప్రశ్నించగా పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు.

ఈసందర్భంగా ఎస్పీ రవికుమార్, జిల్లాకార్మిక అధికారి సిద్దప్ప ఖైనూర్, మహిళా శిశు అభివృద్ధి అధికారి జలాలప్ప, జిల్లాబాలల సంరక్షణ అధికారి ఏకినాగప్ప, క్షేత్ర విద్యాశాఖాధికారి సిద్ధలింగమూర్తి, బళ్లారి నగర సభ డివిజన్ డీవైఎస్పీ నందారెడ్డి, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, ప్రభుత్వ సూపరింటెండెంట్ శిశు సంక్షేమ సంస్థ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటంతోనే సమస్యల పరిష్కారం

● అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ ఘోష్


సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ ఘోష్

బళ్లారి సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంఘటిత పోరాటాల ద్వారానే దేశంలోని రైతుల సమస్యలకు పరిష్కారం అవుతాయని అని ఏఐకేకేఎంఎస్(అఖిల భారత రైతు కృషి కార్మికుల సంఘం)అఖిల భారత ప్రధాన కార్యదర్శులు శంకర్ ఘోష్ అన్నారు. గురువారం నగరంలోని రామవికాశమందిరంలో ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం రాష్ట్రకమిటీ సమగ్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రైతులు తమ సమస్యలకు పరిష్కారం పోరాటాల ద్వారానే అదిస్తుందని, ఇటీవల ఢిల్లీ సరిహద్దుల్లో అపూర్వమైన విజయం సాధించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. పోరాటాలను అణచి వేసేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసినా ఆ పోరాటం తప్పదేవ పట్టుదలతో, రైతులను ఎవరూ కూలదోని మనోధైర్యం రైతాంగానికి ఉందని నిరూపించారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రకమిటీ కార్యదర్శి భగవాన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమ్మ, ఎన్.సామి, లక్ష్మణ ,ప్రధాకార్యదర్శి బోర్డు సభ్యులు గోవింద్, దీప, మహేష్, బళ్లారి జిల్లా కార్యదర్శి గురల్లి రాజా తదితర రాష్ట్ర కమిటీ సభ్యులు, వందలాది మంది సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పునీత్‌రాజ్‌కుమార్‌కు ఘన నివాళి


పునీత్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

బళ్లారి సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ హోల్ సేల్ వెజిటబుల్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఏపీఎంసీ కూరగాయల మార్కెట్‌లో డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్(అప్పు) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునీత్‌రాజ్‌కుమార్ రెండవ సంవత్సరం వర్ధంతి నిర్వహించినట్లు తెలిపారు. మన్నుల్లో అన్నదానం చేశామని, అయన అభిమానులు ఎన్నటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో కూరగాయల వ్యాపారులు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక వస్తు ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న కొల్లి శ్రీనివాసరావు

సిరుగుప్ప, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలను అధిగమించి భారత్ నెంబర్ వన్ స్థానానికి ముందడుగులు వేయాలంటే వైజ్ఞానికంగా ఎదిగిన నాడే సాధ్యపడుతుందని కమ్మ సంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణం ప్రభుత్వ పీయూసీ కళాశాలలో విజ్ఞాన కళా వస్తు ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొల్లి శ్రీనివాసరావు విజ్ఞాన కళా వస్తు ప్రదర్శనలను పర్యవేక్షించారు. విద్యార్థి జమాలి మైనుస్సీసా ఏర్పాటు చేసిన వస్తుప్రదర్శనను తిలకించి ఆమె ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షుల ఆనంద, ఏపీఎంసీ మాజీ డైరెక్టర్ ప్రతాప్ చౌదరి, ప్రిన్సిపాల్ కోట బసప్ప, ఉప్పానకులు, విద్యార్థినీ విద్యార్థులు, జీవనిధి ట్రస్టు అధ్యక్షులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ఎం.మునిరాజు

యూనివర్సిటీ అభివృద్ధే ధ్యేయం

● వీఎస్‌కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మునిరాజు

బళ్లారి సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. మునిరాజు అన్నారు. గురువారం యూనివర్సిటీలోని పరీక్షా హాలు ఎదుట థియోసాఫికల్ సొసైటీ హొసపేట, కెనరా బ్యాంక్ ఆఫ్ బళ్లారి సంయుక్తంగా బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ అవిష్కరణ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీటీ వీసీ ఎం.మునిరాజు మాట్లాడుతూ కొత్తసంవత్సరంలో యూనివర్సిటీలోని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం దాసోహ భవన్ నిర్మిస్తామన్నారు. యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌లో విద్యార్థుల కోసం మాత్రమే బ్యాటరీతో నడిచేవాహనం సేవలను అందించేందుకు ప్రొఫెసర్ రుద్రేష్ తెలిపారు. ఈ వినూత్న సేవలను ప్రారంభించిన తొలి విశ్వవిద్యాలయం ఇదే అని, ఆదేవిధంగా రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం పథకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

థియోసాఫికల్ సొసైటీ డైరెక్టర్ శరణప్ప మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ గిరీష్ కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం కోసం ఎల్లవేళలా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని, విద్యార్థినులకు అనుకూలమైన పథకాన్ని ప్రవేశపెట్టిన యూనివర్సిటీ యజమాన్యాన్ని అభినందించారు. యూనివర్సిటీ మాజీ సిండికేట్ సభ్యుడు రాజశేఖరం మాటాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశించకుండా తమవంతు కృషితో యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. హబ్బళ్ళి బీవీ భూమారెడ్డి సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శివానందా పాటిల్ మాట్లాడుతూ చదువు పూర్తిచేసుకున్న విద్యార్థులు కేవలం ఉపాధి కే పరిమితం కాకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. వివిధ్య ఆలోచనలు ఉన్న విద్యార్థులకు తమతో కలిసి ప్రాజెక్ట్ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఇదే సందర్భంగా విద్యుత్తతో నడిచే వాహనాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో యూనివర్సిటీ మూల్యాంకనం ప్రొఫెసర్ రమేశ్ హోలేకర్, డీన్‌లు, కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన సిద్దరామప్ప, సిండికేట్ అకడమిక్ కౌన్సిలీనభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అణువిద్యుత్ కేంద్రం ప్రయత్నాలు మానుకోవాలి

● గ్రామ పంచాయతీ తీర్మానం


చిక్కబెణకల్లు పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన సభ్యులు

గంగావతి రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా, గంగావతి తాలూకా పరిధిలో అణువిద్యుత్ కేంద్రం స్థాపన ప్రయత్నాలను సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి నిరుపాది బెణకల్లు, తాలూకా కార్యదర్శి బాళప్ప హులిహైదర్ వ్యతిరేకించారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ చిక్క బెణకల్లు, హిరేబెణకల్లు చుట్టు ప్రక్కల అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు భూమిని గుర్తించారనని, ఈ ప్రాంతంలో చారిత్రక స్మారకాలు, కొండలు, గుట్టలో పొగొకంగా పరిసరాన్నాయన్నారు. ఇక్కడి నుంచి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో అంజనాద్రి బెట్ట, 25 కిలోమీటర్ల పరిధిలో గంగావతి పట్టణం ఉందని, చుట్టు ప్రక్కల 12 కిలోమీటర్ల పరిధిలో కుమార రామన ఇతిహాసముందని, చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాలూకా పరిసర రక్షణ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పరిగణించాలాన్నారు. రాత్రికి రాత్రికి అధికారులు సమీక్ష చేసి ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు అందించరాదని, స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలన్నారు.

6న ఆందోళన

చిక్కబెణకల్ గ్రామ సమీపంలో అణువిద్యుత్ కేంద్రం స్థాపన ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 6న జాతీయ రహదారిపై ఆందోళన చేస్తాముకు స్థానిక ప్రజలు సిద్ధమయ్యారు. జిల్లాధికారి సూచనల మేరకు గంగావతి తహసీల్దారు చిక్కబెణకల్లు గ్రామంలోని అటవీశాఖకు చెందిన 1200 ఎకరాల భూమి గుర్తించాలని అసిస్టెంట్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు, అణు కేంద్రం స్థాపనకు సూక్ష్మమైన ప్రాంతంగా అధికారులు గుర్తించిన నేపథ్యంలో చిక్కబెణకల్లు గ్రామంలో ప్రజలు తీవ్ర చర్చకు దారితీసింది. గత నెల డిసెంబరు నెలలో జాతీయ థర్మల్ విద్యుత్ మండలి అధికారులు భూదం జిల్లాకు చేరుకుని స్థానిక జిల్లాస్థాయి సీనియర్ అధికారులతో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శివమూర్తి స్పందిస్తూ చిక్కబెణకల్లు గ్రామంలో వేలాది సంవత్సరాల చారిత్రక చరిత్ర ఉందన్నారు. చిక్కబెణకల్లు వ్యాప్తిలో అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం అవుతుందనే విషయంపై ఇంకా ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోలేదని, ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తహసీల్దార్ అన్నారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కంప్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కిష్కింధలోని ఆనెగొంది దుర్గాదేవి అమ్మవారికి స్థానిక ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కుటుంబసభ్యులతో దుర్గాదేవికు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి యేటా అమ్మవారికి నూతన సంవత్సరం సందర్భంగా దర్శించుకుని కుటుంబీకులతో అమ్మవారికి పూజలు చేపడతామన్నారు. ప్రతి సంవత్సరం రైతులు, ప్రజలు సంతోషంగా వుండాలని కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారమే అభివృద్ధి పనులు జరుపుతున్నామని తెలిపారు.


పూజల్లో ఎమ్మెల్యే గణేష్ కుటుంబ సభ్యులు


కుడితిని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదాయ దుస్తుల్లో పోలీసులు


టెక్కలికోట పోలీస్‌స్టేషన్‌లో ...

పంచె కట్టు.. సూపర్ హిట్టు..!

● సంప్రదాయ దుస్తుల్లో నూతన సంవత్సర వేడుకలు ● పోలీసులకు ప్రశంసల వెల్లువ

కంప్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పేరుకే ఆంగ్ల సంవత్సర వేడుకలు..అయినా వారు సంప్రదాయాన్ని మరువలేదు. పంచె కట్టుతో నూతన సంవత్సర సంబరాలు జరుపుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు పోలీసులు. కుడితినిలో అధికారులు, పోలీసులు అందరూ తెల్ల లుంగీ, తెల్ల చొక్కా ధరించారు. టెక్కలికోట పోలీస్‌స్టేషన్‌లో కూడా సాంప్రదాయ దుస్తుల్లో ధరించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ పోలీసుల చర్యలపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగాల్లో ఉన్నా సంప్రదాయాన్ని గౌరవించాలంటూ అభినందిస్తున్నారు.

హోసూరు జోన్

నూతన పదాధికారుల నియామకం


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

హోసూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా పరిధిలో మండల స్థాయిలో బీజేపీ నూతన పదాధికారులను ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా ఎన్నికల అధికారులు మునవారి బేగం, సత్యతిపతి కొత్తగా ఎన్నికైన నాయకుల పేర్లను ప్రకటించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ బాలకృష్ణన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిరాజు పాల్గొన్నారు. నూతన కార్యవర్గంలో హోసూరు తూర్పు మణికంఠన్, కుముద, లోకేశ్, గోపి, హోసూరు యూనియన్ నార్త్ మోహన్ కుమార్, షూలగిరి వెస్ట్ యూనియన్ అంజప్ప, తళి యూనియన్ శివకుమార్, తళి సెంట్రల్ యూనియన్ - మాక్కందేశ్వర రావ్, డెంకణీకోట సుదారాణి, మండల నాయకులుగా ప్రకటించిన అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికారులు విజయకుమార్, అన్బరసన్, శ్రీనివాసులు, మురుగన్, ప్రవీణ్‌కుమార్, నాగరాజు, రాజశేఖర్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

●నంబర్ ప్లేట్ ఆధారంగా నిందితుడి అరెస్ట్

హోసూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట తాలూకాలో కెలమంగలం ప్రాంతానికి చెందిన వృద్ధురాలు(80) భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తోంది. డిసెంబరు 31న రాత్రి హోసూరు బస్టాండులో ఉన్న సమయంలో 35 ఏళ్ల వ్యక్తి ఆమె దగ్గరికి వచ్చాడు. వృద్ధురాలితో మాట్లాడుతూ మార్కెట్ దగ్గర డ్రాప్ చేస్తానని బైక్‌పై ఎక్కించుకున్నాడు. వృద్ధురాలు అతడి ద్విచక్ర వాహనంపై వెళ్లింది. కృష్ణగిరి జాతీయ రహదారిపై వెళ్తుండగా అటవీ ప్రాంతం వైపు ద్విచక్రవాహనాన్ని నడిపాడు. వృద్ధురాలిని అక్కడికి తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేసింది. ఆ మార్గంలో వెళ్తున్న పాదచారులు రావడంతో ఆ వ్యక్తి అక్కడినుంచి పరారయ్యాడు. ఆమెను చికిత్స నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హోసూరు టౌన్ మహిళాపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించారు. నెంబర్‌ప్లేట్ ఆధారంగా హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని ఉలియాళం లో ఉంటూ కూలి పనిచేసే చేస్తున్న లక్ష్మణ(35)గా గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి తీసుకొస్తుండగా తప్పించుకునేందుకు యత్నించాడు. కింద పడి అతడి కుడి కాలు విరగడంతో హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

కొత్తచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు ఈనెల 4వ తేదీ నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా విద్యా శాఖాధికారి(డీఈఓ) కిష్టప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వతేదీనే ఇందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్ని కారణాలతో అమలు కాలేదన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

హోసూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హోసూరు యూనియన్ పరిధిలో బేరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 900 మంది విద్యార్థులు ఆంగ్లం, తమిళం మాధ్యమంలో చదువుతున్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన తర్వాత డిసెంబరు 24 నుంచి జనవరి 1 వరకు 9 రోజులు సెలవుల అనంతరం గురువారం పాఠశాల తెరిచారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందజేయాలని తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల విద్యాశాఖ ప్రకటించిన మేరకు అందచేశారు. 750 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.


మూడో సెమిస్టర్ పుస్తకాలతో విద్యార్థులు